


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


# స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లలో రాష్ట్రానికి అందిన నిధులెన్ని..?

**లోక్ సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి**



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త** 15వ ఆర్థిక సంఘం నిధులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు మొదటి విడత అందించిన నిధులు ఎన్నని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. నిధులు విడుదల అయిన విషయం వాస్తవం అయితే.. ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన టైడ్, అన్ టైడ్ గ్రాంట్ల వివరాలు తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భఘేల్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల కోసం 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన గ్రాంట్ల మొదటి విడతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విడుదల చేసినట్లు ఆయన సమాధానం ఇచ్చారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు 593.26 కోట్లు టైడ్ గ్రాంట్, 395.51 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్లను అందించినట్లు వివరించారు. వీటిల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు, గ్రామ పంచాయతీలకు వరుసగా 70 శాతం, 15 శాతం, 15 శాతం నిష్పత్తిలో అందించబడతాయని సమాధానం ఇచ్చారు.

# మంత్రుల మీటింగ్ కి ప్రోటోకాల్ కరువు



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ,ఇద్దరు మంత్రుల, జిల్లాలోని శాసనసభ్యులు ఆధ్వర్యంలో జిల్లా అధికారులుతో సమీక్ష సమావేశం, శంకరన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. కానీ ఈ సమీక్ష సమావేశం జరుగుతున్నట్టు కాని మంత్రులు కలెక్టర్ కార్యాలయముకు వస్తున్నట్లు అధికారులు చెప్పకపోవడం గమనార్థకం అప్పటికప్పుడు జిల్లా అధికారులకు ఫోన్ చేసి మీటింగ్ జరుగుతుంది రమ్మని చెప్పి హడావుడిగా పిలిపించారు స్వయంగా డిఆర్ఓ ఫోన్లు చేసి జిల్లా అధికారులకు రమ్మని చెప్పారు ప్రోటోకాల్ విషయంలో డిఆర్ఓ ఉదయభాస్కర్ సిబ్బందికి అప్పగించగా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించరు అనవచ్చు మీటింగ్ హాల్ విషయం కాని అధికారులకు కుర్చీలు విషయం కాని, స్నాక్స్, వాటర్ సదుపాయాలు ,చాలి చాలని విధంగా నిర్వహించారు.

# మంత్రులతో భేటీ అయిన రాజేంద్రన్

**ప్రత్యేక దర్శన టికెట్లను కేటాయించండి**
**ఆనంకి లేఖ అందజేసిన రాజేంద్రన్**
**మంత్రి రాజేంద్రన్‌కి స్వాగతం పలికిన ఆనం, నారాయణ, ఫరూక్, ఎమ్మెల్యేలు**



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** తమిళనాడు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ నెల్లూరుకి మంగళవారం వచ్చేసిన ,నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని సంతపేటలో ఉన్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్నారు. మంత్రి రాజేంద్రన్‌కి మంత్రితో పాటు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌లు రాజేంద్రన్ కి ఘన స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తమిళనాడు రాష్ట్ర మంత్రితో పాటు మంత్రులు నారాయణ, ఆనం, ఫరూక్, ఎమ్మెల్యేలకు వేద పండితులు ఆశీర్వచనములు అందజేసి సత్కరించారు. తమిళనాడు టూరిజం కార్పొరేషన్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం స్పెషల్ ఎంట్రీ టికెట్లను కేటాయించాలని మంత్రి ఆనంకు మంత్రి రాజేంద్రన్ లేఖను అందజేశారు. అనంతరం వారు పలు విషయాలు చర్చించుకున్నారు.

# కార్పొరేషన్ కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కరించండి

**మేయర్ స్రవంతిజయవర్ధన్**



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ నందు కార్పొరేషన్ కు సంబంధించిన కోర్టు కేసులు లకు లీగల్ సెల్ విభాగంతో మేయర్ స్రవంతిజయవర్ధన్ సమీక్ష సమావేశాన్ని మంగళవారం ఆమె ఛాంబర్ లో నిర్వహించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన పెండింగ్ లో ఉన్నటువంటి కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రంగారావు, నాగేశ్వరరావు, మేనేజర్ ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తులు కాపాడేందుకు జీవం పోసిన చంద్రబాబు


**చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక**
**చారిత్రక నిర్ణయాలు తీసుకోనున్నాం**




**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** దేవుడి ఆస్తులను కాపాడే బాధ్యతని నీకు ఇస్తున్నానని, వాటిని జాగ్రత్తగా కాపాడు అని చంద్రబాబు చెప్పారని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎన్నిక కోసం బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోర్డు సభ్యులలో ఒకరైనా ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షత వహించి, ఎన్నికల పక్రియను నిర్వహించగా సభ్యులలో ఒకరైనా నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌ను ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటీఫికేషన్ విడుదల చేసింది. అనంతరం షేక్ అబ్దుల్ అజీజ్ ఆయన ఛాంబర్లో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డును పునర్నిర్మించిన చంద్రబాబుపై ఆరోపణలు చేశారన్నారు. వక్ఫ్‌ఆస్తులను కాపాడటమే కాదు ఆదాయం సృష్టించి సమాజానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, బోర్డుపై ఉందన చెప్పారు. బోర్డు స్తంభించడం వల్ల అనేక రోజుల నుంచి నిర్ణయాలు తీసుకోలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వంలో నూతన బోర్డుతో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబుతున్నామని అజీజ్ తెలిపారు. వక్ఫ్‌బోర్డులో 60 వేల ఎకరాల భూమికి గాను 32 వేల ఎకరాలు అంటే 50 శాతం కన్నా ఎక్కువ కబ్జాకు గురైందన్నారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో పవిత్రమైన ఆలోచనలు చేసి అనేక సంస్కరణలు తీసుకుని వస్తానని అజీజ్ తెలియజేశారు.

# నాడిపట్టని వైద్యులు.. నీరసిస్తున్న రోగులు

**3.30కే ఇంటి బాట పట్టిన వైద్యులు**



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలు రోగాల భారిన పడి డబ్బులిచ్చి పట్టణాల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక రోగం నయం చేసుకునేందుకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్ళగా అక్కడ వైద్యులు లేకపోవడంతో సరైన వైద్యం అందక నీరసిస్తున్న సంఘటన సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. సైదాపురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు వైద్యం అందించేందుకు ఇద్దరు వైద్యాధికారులను, సిబ్బందిని వైద్య ఆరోగ్య శాఖ నియమించింది. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 21 పంచాయతీల ప్రజలు వివిధ రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. అయితే విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది అంతా మా ఇష్టాం.. మమ్మల్ని అడిగే వారు లేరు అన్న విధంగా సమయ పాలన పాటించకుండా ఎప్పుడైనా రావడం, వారికి నచ్చినట్లు ఇంటికి వెళ్ళిపోవడం జరుగుతుండటంతో రోగులు వైద్యం అందక పలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి చికిత్స నిమిత్తం 3.30గంటలకు ఆరోగ్య కేంద్రానికి వెళ్ళగా.. అక్కడ వైద్యులు గాని, సిబ్బంది గాని ఎవరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ విషయమై బాధితుడు స్వయంగా ఆరోగ్య కేంద్రంలో వీడియోలతో పాటు ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు వాట్సప్ చేశారు. దీంతో మండలంలో సంచలనంగా మారింది. సామాన్య ప్రజానీకానికి వైద్యం చేయకుండా హాజరు నమోదు చేసుకుని మధ్యాహ్నానికి వైద్యాధికారులు ఇంటి బాట పడుతుండటంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్య శాఖకు సంబంధించి ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో ఈ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సరిగ్గా విధులకు హాజరు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# స్మార్ట్ సిటీకి చర్యలు : మెప్మా అధికారులకు దిశా నిర్ధేశం



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త –వైద్యం** నగరాన్ని స్మార్ట్ సిటీ చేసే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం నగరంలోని నారాయణ మెడికల్ కాలేజీలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెప్మా ఎండీ తేజ్ భరత్, మున్సిపల్ కమీషనర్ సూర్య తేజలు పాల్గొన్నారు. అనంతరం మెప్మా అధికారులకు మంత్రి నారాయణ దిశా నిర్ధేశం చేసి పలు సూచనలు, సలహాలు చేశారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణలు జరగకుండా ల్యాండ్ గ్రాబింగ్ చట్టం..

## రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి - జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నెల్లూరు, అర్బన్, డిసెంబర్ 17, ప్రభాత వార్త:** భూ ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చిందని, దీనికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఆయన రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, డ్వామా, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్‌శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు, భూ కబ్జాలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతుల పాస్‌పుస్తకాలు, హద్దురాళ్లపై జగన్ బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. సుమారు పది లక్షల కోట్లకు పైగా అప్పులు మిగిల్చిపోయారన్నారు. ఆ అప్పులకు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తుందని, వీటిని సరిచేసుకోవడానికే తమకు సమయం సరిపోతుందన్నారు. రెవెన్యూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను జిల్లాస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్, జేసీకి సూచించారు. పరిష్కారం కాని సమస్యలను నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన భూ ఆక్రమణల నుంచి ప్రజలను కాపాడేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తమ ముఖ్యమంత్రి రద్దు చేసి ప్రజల భూములకు రక్షణ కల్పిస్తూ నూతన చట్టం ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. గత ఐదేళ్లు దెబ్బతిన్న రోడ్లకు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. తమ ప్రభుత్వం ఆర్అండ్‌బి రోడ్లపై గుంతలు లేకుండా చేయడానికి జిల్లాకు 20కోట్ల నిధులు మంజూరు చేసిందని, జనవరి 15లోగా వీటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 67కోట్లతో 1157 సిసి రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో మంచి కార్యకర్తలుగా పనిచేసిన అబ్దుల్ అజీజ్‌కు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సముచిత పదవులు ఇచ్చారని, అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ చెప్పారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో ఎండోమెంటు భూసమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉపాధిహామీ నిధుల కేటాయింపు గురించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించామని, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉపాధిహామీ మిగులు నిధులను అవసరమైన ప్రాంతాలకు కేటాయిస్తామని డిప్యూటీ సీఎం చెప్పినట్లు మంత్రి ఆనం అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కేబినెట్ ఆమోదం పొందిందని, ప్రభుత్వం నియమ నిబంధనలు రూపొందిస్తుందని, త్వరలోనే ఈ చట్టం అమలులోనికి రానున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని నేటి నుంచి అందించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఇక్కడి రైతులకు 130 క్యూసెక్కులు ఇస్తే రైతుల చివరి భూములకు కూడా నీరు అందుతాయని, రిజర్వాయర్ నుంచి 80 నుంచి 100 క్యూసెక్కుల నీటిని ఇప్పటికే అందిస్తున్నామని చెప్పారు. నేటి నుంచి పూర్తిస్థాయిలో అందిస్తామని కలెక్టర్ చెప్పారు. బ్యాకమ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన జర్మనీ కంపెనీతో చర్చించి రిజర్వాయర్ గేట్లను తెరిపించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఇలాంటి సమస్యలు ఉన్నాయో వాటన్నింటిని గుర్తించి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని, ప్రాజెక్టు కమిటీలకు కూడా ఈనెల 21న ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎరువులు ప్రస్తుతానికి సరిపడ అందుబాటులో ఉన్నాయని, వరిసాగు ఎక్కువగా ఉన్నందున కొరత రాకుండా ఇంకా కొంత ఎరువులు కేటాయించేందుకు కృషి చేయాలని మంత్రులను కోరారు. ఉపాధిహామీ పనిదినాలు పెంచడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఉపాధిహామీలో రైతుల పంటపొలాల్లోని డొంక రోడ్ల నిర్మాణాన్ని ఉపాధిహామీలో చేపట్టాలని, పైలెట్‌ప్రాజెక్టుగా కావలి నియోజకవర్గాన్ని పరిశీలించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరగా, మట్టిపనులకు ఉపాధిహామీ నుంచి డొంక రోడ్లు ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నందున, ఫిబ్రవరి, మార్చిలో రోజుకు లక్ష పనిదినాలు లక్ష్యంగా 45లక్షల పనిదినాలు పూర్తి చేస్తామని చెప్పారు. అటవీశాఖ భూముల గురించి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ భూమి ఒకరి అనుభవంలో వుంటే పాసుపుస్తకాల్లో మరొకరి పేర్లు ఉన్నాయని, ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఫారెస్ట్ హక్కుల చట్టంనిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీలో గతంలో జరిగిన పనులు సక్రమంగా జరిగాయో లేదో విచారించి బిల్లులు మంజూరు చేయాలని డ్వామా పీడీకి సూచించారు. తిరుమలమ్మపాలెం, నక్కలవాగుపై కాజ్‌వేలు నిర్మించాలని, జిల్లాలో లోలెవల్ కాజ్‌వేలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు చేపట్టాలన్నారు. పేదల భూములు ఆక్రమించిన వారికి తగిన గుణపాఠం చెప్పాలని, భూ ఆక్రమణలపై వివరాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశామని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాళ్లపాడు ప్రాజెక్టు సమీక్షలో ముందుగానే గేట్లు ఎందుకు పరిశీలించకోలేదని కిందిస్థాయిలో ఇరిగేషన్ సిబ్బంది ఏం చేస్తున్నారని గత ఐదేళ్లలో ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యంగా పనిచేయడం వలనే ఈ సమస్యలు వచ్చాయన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల గురించి గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం చేయాలని, నోషనల్ ఖాతాల పరిధిని ఆర్డీవో స్థాయికి తీసుకురావాలని కోరారు. సిజెఎఫ్ఎస్ భూములను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా మార్చడం వలన రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందలేకపోతున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గతంలో టెండర్లు పిలిచిన రోడ్డు పనులకు కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి పనులు చేపట్టేలా చూడాలని ఆర్అండ్‌బి ఎస్ఈని కోరారు. రోడ్లపై వున్న ముళ్ల చెట్లను జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, వనసంరక్షణ సమితులను బలోపేతం చేయాలని కోరారు. నరేగా నిధులను నియోజకవర్గాల వారీగా కేటాయించాలని కోరారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల వలన రైతులు తమ పొలాలకు నీరు అందక నష్టపోయారని, కేవలం లక్ష రూపాయలు ఖర్చు చేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. గండిపాలెం రిజర్వాయర్‌ను కూడా ముందుగా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో 731 రెవెన్యూ గ్రామాలుండగా 232 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి చేశామని, వీటిలో 2951 అర్జీలు వివిధ భూసమస్యలపై అందాయని చెప్పారు. వీటిలో 120 అర్జీలను పరిష్కరించినట్లు చెప్పారు. భూ సమస్యల్లో ఆర్‌వోఆర్, 22ఎ తొలగింపులు, ఎఫ్‌లైన్ సర్వే, అసైన్‌మెంటు భూముల కోసం పలు వినతులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఎస్‌పి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జడ్పీ సిఇవో విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని, ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డిఇవో బాలాజీరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నుడా చైర్మన్ గా శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం









**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (నుడా) ద్వారా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రివర్యులు ఎన్ యం డి ఫరూక్ సూచించారు. మంగళవారం నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా అభిమానుల కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తోలుత నగరంలోని నర్తకి సెంటర్ నుండి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఆర్ టి సి జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి తోడుగా అశేష అభిమానులు, వేలాది కార్యకర్తలు వెంట రాగా భారీ ర్యాలీ గా నుడా కార్యాలయంకు కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి చేరుకున్నా రు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి , సర్వేపల్లి, ఉదయగిరి, కావలి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి హాజరయ్యారు. అతిథులకు ఘన స్వాగతం పలికిన నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నుడా విసి సూర్యతేజ అనంతరం నుడా చైర్మన్ గా కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

**అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి ఇంచార్జ్ మంత్రి ఫరూక్** ప్రమాణస్వీకారం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక సభలో జిల్లా ఇన్చార్జి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో తాను మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వామినయ్యానని అదేవిధంగా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల ద్వారా రాష్ట్రంలోని నగరాలు పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందరి సహకారంతో నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని నుడా చైర్మన్ కు సూచించారు. కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కష్టపడినందునే పదవి వరించిందన్నారు.

**జిల్లా సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా పనిచేయాలి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి** రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా నుడా పనిచేయాలన్నారు. నుడా పరిధి జిల్లా అంతటా ఉన్నందున అన్ని నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యత నుడా చైర్మన్ పై ఉందన్నారు. నుడా అభివృద్ధికి ఏర్పాటుచేసిన మాస్టర్ ప్లాన్ ప్రకారం నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల సముదాయంలో ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**సంపద సృష్టి ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యం మునిసిపల్ మంత్రి నారాయణ** రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, 21 అర్బన్ అథారిటీలు ఉన్నాయని వాటితోనే సంపదా సృష్టించి తద్వారా మాత్రమే కార్పొరేషన్ లు , పట్టణాలు అభివృద్ధి సాధ్యం అవుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వివరించారు. రోజు రోజుకు పట్టణ జనాభా 34 శాతం వృద్ధితో ఎప్పటికప్పుడు పెరుగుతుందన్నారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం టౌన్ ప్లానింగ్ అనుమతుల్లో ప్రజలకు అనుకూలమైన విధి విధానాలు రూపకల్పన చేస్తుందని, త్వరలోనే ఖరారు చేసి విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని అర్బన్ అథారిటీలకు జాయింట్ కలెక్టర్లను వైస్ చైర్మన్లు గా నియమించామన్నారు. నెల్లూరు నగరానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి రాష్ట్రంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దుటకు తన వంతు కృషి చేస్తానన్నారు.

**నా చిరకాల మిత్రులు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి** నా చిరకాల మిత్రుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నుడా చైర్మన్ గా రెండోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న ఈ కార్యక్రమానికి నేను రావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అలాగే ఈ పదవి పార్టీ కోసం కష్టం చేసిన వారికి వచ్చిన పదవి అని కొనియాడారు. అనేక రకాలుగా పార్టీ కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, జైలుకు వెళ్లిన కార్యకర్తల కళ్లల్లో వెలుగు నింపాలని కోరారు.

**కార్యకర్తలే నాకు అన్ని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి** నుడా చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ నా కన్న తల్లిదండ్రులు కన్నా,నా భార్య బిడ్డలు కన్నా నాకు కార్యకర్తలే అన్ని అని స్పష్టం చేశారు. నాకు ఈ పదవి కార్యకర్తలు పెట్టిన భిక్ష అని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి లోకేష్ ,జిల్లా మంత్రులు,ఎమ్మెల్యే లు, జిల్లా కూటమి నాయకులకు తన కృతజ్ఞతలన్నారు. ఐ లవ్ నెల్లూర్ నినాదంతో పరిశుభ్రమైన, సుందరమైన నెల్లూరు ను తీర్చిదిద్దటానికి, అదేవిధంగా జిల్లా మంత్రుల సహాయ సహకారాలతో నుడా పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా పార్టీలకతీతంగా నెల్లూరు జిల్లాకు విశేష సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆనం వివేకానంద రెడ్డి, మంగమూరి శ్రీధర కృష్ణారెడ్డి, మాగుంట , మాజీ ఎంపీ ఉక్కాల రాజేశ్వరమ్మ , మాగుంట పార్వతమ్మ, అలాగే నాయకులు వెన్నెలకంటి రాఘవయ్య, విగ్రహాలను నెల్లూరు నగరంలో ప్రతిష్టించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం చివరలో అగ్రశ్రేణి నటులు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నుడా చైర్మన్ కు ఫోను చేసి తమ శుభాకాంక్షలు అందచేశారు. సీనియర్ మంత్రుల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి పదంలో నడపాలని శ్రీనివాసులరెడ్డికి సూచించారు. అలాగే కార్యకర్తలకు పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ సంభాషణ అంతా మైకు ద్వారా ప్రజలందరికీ వినిపించడంతో ఒక్కసారిగా అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, మాజీ ఎమ్మెల్యే లు దివి శివరాం, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, ఇతర టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షునిగా జెట్టి రాజగోపాల్‌రెడ్డి




**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త** : కోవూరు సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ నూతన పాలకవర్గం ఎంపిక కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి. వెంకటరమణ వ్యవహరించారు. సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీకి సంబంధించి మొత్తం 10 సాగునీటి సంఘాల అధ్యక్షులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. మొత్తం ఈ కమిటీ పరిధిలో కోవూరు మండలానికి సంబంధించి ఇనమడుగు, పాటూరు, కోవూరు నీటి సంఘాలు ఉండగా.. బుచ్చిరెడ్డిపాలెంకు సంబంధించి పెనుబల్లి, దామరమడుగు, రేబాల, కొడవలూరు మండలానికి సంబంధించి రామన్నపాలెం, విడవలూరు మండలానికి సంబంధించి ముదివర్తి బిట్-1, సంగం మండలానికి సంబంధించి పడమటి పాలెం, అన్నారెడ్డిపాలెంలు ఉన్నారు. ఈ నేపథ్యంలో కోవూరు సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షునిగా ఇనమడుగు నీటి సంఘం అధ్యక్షుడు జెట్టి రాజగోపాల్‌రెడ్డి పేరును సమావేశంలో నీటి సంఘాల అధ్యక్షులు ప్రతిపాదించారు. ఉపాధ్యక్షునిగా రేబాల నీటి సంఘం అధ్యక్షుడు ఎన్. రమణారెడ్డి పేరును ప్రతిపాదించారు. దీంతో ఈ ఎన్నికల్లో ఎవరూ పోటీ లేనందున వీరిరువురిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవంగా గెలుపొందిన వీరికి ఆయన ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారిగా సైదాపురం ఎంఈవో పి. హైమావతి, కోవూరు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు వ్యవహరించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా



**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త** : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ పథకం కింద ఎంపికైన 99 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి పరిధిలో గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై మరింత అవగాహన కల్పించాలి. అదేవిధంగా తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఈ 99 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇటీవల చిన్నారులకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నాలుగు మండలాల సూపర్‌వైజర్లు రాధిక, ఉమా, ప్రసన్న, శకుంతల, నిర్మల, పద్మావతి, సుమిత్ర, ప్రమీల, రమణి, నాగభూషణమ్మలు ఉన్నారు.

## ప్రతి పొదుపు గ్రూపు తప్పనిసరిగా ఆడిట్ చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త** : కోవూరు సంఘమిత్ర పరిధిలో ఉన్న ప్రతి పొదుపు గ్రూపు తప్పనిసరిగా ఆడిట్ చేసుకోవాలని ఈ దిశగా పొదుపు గ్రూపులు వీవోఏలు తగు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం వీవోఏలకు , ఆడిట్ సీఆర్పీలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి పొదుపు గ్రూపు రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. రుణాలను నూతన వ్యాపారాలపై దృష్టి పెట్టి వారి ఆర్థికాభివృద్ధి పెంపుదల చేసుకునేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా వీవోఏల వారీగా పనితీరుపై సమీక్షించారు. కోవూరు సంఘమిత్ర అధ్యక్షురాలు సీహెచ్ రమ్య, వెలుగు సీసీలు రాజశేఖర్, రాము, చైతన్య, శోభ, తదితరులు ఉన్నారు.

## రైతుల నమ్మకాన్ని వమ్ము చేయం




**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త** : కోవూరు సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎన్. రమణారెడ్డిలను మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు శాలువా, పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన జెట్టి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యతను అప్పగించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. నాకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి సాగునీటి కాలువలకు పూర్వ వైభవం తెచ్చేలా తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ పదవికి ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన కోవూరు నియోజకవర్గ పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, ఆదాల శివారెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, కరేటి శ్రీనివాసులు, వేగూరు సర్పంచ్ అమరావతి, దాసరి మురళి, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, మస్తాన్, నాటకరాణి వెంకట్, పెద్ద సంఖ్యలో నేతలు ఉన్నారు.

## క్రమం తప్పకుండా బరువులు ఎత్తులు తీయాలి



కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త : కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సక్షమ్ పథకం కింద ఎంపికైన 99 అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం చిన్నారులకు బరువులు, ఎత్తులు తూచే యంత్ర పరికరాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ ప్రతి నెల 10వ తేది లోగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తల వారి వారి కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల యొక్క బరువు, ఎత్తు పారదర్శకంగా చేపట్టి వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు నాలుగు మండలాల సూపర్‌వైజర్లు రాధిక, ఉమా, ప్రసన్న, శకుంతల, నిర్మల, పద్మావతి, సుమిత్ర, ప్రమీల, రమణి, నాగభూషణమ్మలు ఉన్నారు.

## పైడేరు ఎస్కేప్-2 కమిటీ అధ్యక్షుడిగా బీద గిరిధర్



అల్లూరు డిసెంబర్ 17 ప్రభాత వార్త: అల్లూరు మండలంలో ఇటవల కాలంలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన ఎనిమిది మంది నీటి సంఘాల అధ్యక్షులు మంగళవారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు సమక్షంలో పైడేరు ఎస్కేప్ -2 కమిటీ అధ్యక్షుడిగా బీద గిరిధర్ ఉపాధ్యక్షుడిగా మేడా కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీవో రజినీకాంత్ ఈవోపీఆర్డి పెంచల వీరేంద్ర. హౌసింగ్ ఏఈ సిహెచ్ వెంకటేశ్వర్లు , కార్యాలయ సిబ్బంది బీద గిరిధర్ మేడ కృష్ణారెడ్డిని సన్మానించారు కార్యాలయ ఆవరణలో తెలు గుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బీద గిరిధర్ మేడా కృష్ణారెడ్డిని శాలువాలుపూలమాలతో ఘనంగా సన్మానిం చారు. బీద గిరిధర్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల అధ్యక్షులు ఎన్నికల్లో మండలంలో ఎనిమిది మంది సభ్యులను నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నుకోగా వారిలో అల్లూరు బిట్టు 3 నీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్న నన్ను . పైడేరు ఎస్కేప్-2 కమిటీ అధ్యక్షుడిగా. సింగపేట వన్ నీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్న మేడ కృష్ణారెడ్డిని ఉపాధ్యక్షుడిగా నీటి సంఘాల అధ్యక్షులు అందరూ ఎలక్షన్ అధికారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు మాకు ఈ అవకాశం కల్పించిన కావలి శాసనసభలు దగుబాటి వెంకటకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు తెలుగుదేశం నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి ఊటు శ్రీకాంత్ రెడ్డి సామంతుల పరంధామరెడ్డి రామిశెట్టి కృష్ణ చైతన్య నీలపరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి కలికి శేఖర్ రెడ్డి సిహెచ్ రామకృష్ణ అంబటి రాజేంద్ర ఎందేటి హరికృష్ణ తోట శ్రీహరి మునిరాజా కావాలి జగన్మోహన్ రావు కావాలి కృష్ణ రాచూరు శ్రీను గుమ్మడి పుట్టయ్య మండలంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**- 3.5 కేజీల గంజాయి పట్టివేత-రెండు బైక్‌లు స్వాధీనం - డియస్పీ వేణుగోపాల్**



**ఆత్మకూరు,డిసెంబర్17,ప్రభాతవార్త:** ఆత్మకూరు డివిజన్ పరిధిలో గంజాయి అక్రమరవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డియస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆత్మకూరు సిఐ గంగాధర్ తన బృందంతో కలిసి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని పంటవీధి సమీపంలోని పంట పొలాల్లో గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను , 5మంది కొనుగోలు చేస్తున్న యువకులను అరెస్ట్ చేశారు. వీరి నుండి 3.5కేజీల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనపరచుకున్నారు. వీరిలో షేక్ మీరావలి, పరబ్రహ్మాచారి ఇద్దరు గంజాయి రవాణా చేసేవారు , ఉదయగిరి వెంకటేశ్వర్లు , షేక్ ముస్తఫా ఇరువురు విక్రయించేవారు, మిగిలిన 5మంది గంజాయి కొనుగోలు చేసే యువకులని డియస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయికి బానిసై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు నిత్యం పిల్లలను గమనిస్తుండాలని సూచించారు. గంజాయిని విక్రయించిన , సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనపరచిన ఆత్మకూరు సిఐ గంగాధర్ ,ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, సిబ్బందిని అభినందించారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం



**కొడవలూరు, (విడవలూరు), డిసెం బర్ 17, ప్రభాతవార్త** మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం కోవూరు ఏడిఏ డి.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించా రు. ఈసందర్భంగా ఆమె రైతులకు వరిలో ఆకు ముడత, మూమపిప్పి నివారణకు వేప నూనె 5 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి వాడాలని సూచించడం జరిగినది. అదేవిధంగా భాస్కరం ఎరువులను కేవలం దుక్కిలో వేసుకోవాలని పై పాటుగా వేసుకోవడం వలన సుష్మ ధాతు లోపాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందనారు. రైతులు జీవన ఎరువులు వాడకాన్ని అవలంబించుకోవాలని, వరిలో సూడోమోనాస్ యొక్క ఉపయోగాలు, ఆవశ్యకత గురించి తెలియచేసారు. వ్యవసాయ అధికారిని సిహెచ్. శ్రీలక్ష్మి, ఏవో పి. వెంకటరావు పృథ్వి , నిహారిక పాల్గొన్నారు.

## గండిపాలెం, గుడినరవ గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని గండి పాలెం, గుడినడవ గ్రామాల్లో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. ఉల్లికోడు, ఆకు ముడత ఉధృతంగా ఉండటం గమనించారు. దీనిపై సస్యరక్షణ చర్యలు పాటించాలని రైతులను కోరారు. అదే విధంగా కొన్ని సలహాలు సూచనలు క్షేత్రస్థాయిలో వివరించారు. ఉల్లికోడ్ నివారణకు పిప్రోనిల్ 5 శాతం ఎస్‌సీ 400-600 ఎంఎల్ లేదా కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు 10 కేజీలు ఎకరాకు వాడాలని కోరారు. ఆకు ముడత నివారణకు పొలం ఇరువైపుల నుండి తాడు లాగాలని సూచించారు. సచివాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా

## శకునాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని శకునాలపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడమైంది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని గండపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పుట్టుకతో వచ్చేటువంటి లోపాలను గుర్తించి వ్యక్తిగత ఆరోగ్య కార్డులో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని గుర్తించి నెల్లూరులోని డైస్కకు రిఫర్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో బాల బాలికలకు రక్త పరీక్షలు, బరువు, ఎత్తు, తల చుట్టు కొలతలు బాడీ మాస్ ఇండెక్స్, కుటుంబానికి సంబంధించిన ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని కార్డులో నమోదు, ఆన్‌లైన్ చేయడం జరుగుతుంది. ప్రతి విద్యార్థికి అభ ఐడీ క్రియేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎంఎల్‌హెచ్‌పీ కే.రాజరాజేశ్వరి, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు అనిత, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి తోడ్పడండి



**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఉదయగిరి మేజర్ పంచాయతీలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభి వృద్ధికి తోడ్పడాలని ఈవోపీఆర్డీ డి.షేక్ కరిముల్లా తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని సిబ్బందికి సహకరించాలని కోరారు. మౌలిక వసతుల కల్పనలో సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం పాలక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి ఎంపీడీఓ



ఉలవపాడు, డిసెంబర్ 17, ప్రభాతవార్త సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎంపీడీఓ ఎస్.విజయ అన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి గురువారం వరకు నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజున ఈ కార్యక్రమాన్ని కందుకూరు డీఎల్‌పీఓ కొండపి కృష్ణమోహన్, స్థానిక ఎంపీడీఓ ఎస్.విజయ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రస్తుత ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి వనరులను మిగేలేలా వరకు చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 16వ తేదీ నుండి 19వ తేదీవరకు జరిగే మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల వారికి శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. 2030 సంవత్సరం నాటికి ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనకు ఇటువంటి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీపీఏలు తదితరులు పాల్గొన్నారు.

## అఘోరి శ్రీనివాస్ పై కేసు నమోదు

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** క్రైస్తవుల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అఘోరి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మైనార్టీ నేత సయ్యద్ సమీ చిన్న బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేడు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత



**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త** : కోవూరులోని ఎస్‌టీఎస్‌లో బుధవారం 132 కేవీకి సంబంధించిన బ్రేకర్లు మారుస్తున్నందువలన కోవూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీరు కె. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు మండలానికి సంబంధించిన వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలన్నారు. అత్యవసర విభాగానికి సంబంధించిన వారు ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## మందకృష్ణ మాదిగ జిల్లా పర్యటన ఎప్పుడొచ్చిన విజయవంతం చేయాలి



**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఎస్సీ వర్గీకరణ అమలుకై నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం టౌన్‌లోని ఏబీఎం చర్చి నందు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఎంఎస్పీ సీనియర్ నాయకులు బెజవాడ బాల గురవయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగలు, సీనియర్ నాయకులు బకీర్ జాషువా మాదిగలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కొరకు ముప్పై సంవత్సరాల నుండి అలుపెరగని పోరాటం చేసి ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పోరాటానికి నిదర్శనమని అలాంటి నాయకుని నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందని ఎస్సీ వర్గీకరణపై మాలల్లో కొంత మంది చేస్తున్న కుట్రను మాదిగలు తిప్పికొట్టాలని అందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిజమైన వాసులైతే ఎస్సీ వర్గీకరణ మీ మాటలు ఎందుకు సాధించిన రిజర్వేషన్లు సమానంగా పంచుకునే కాడా సహకరించండి లేదంటే మీరు ఒంటరి వారౌతారని హెచ్చరించారు. కార్యక్రమం అనంతరం ఉదయగిరి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఇన్‌ఛార్జీలను నియమించడం జరిగిందని దుత్తలూరు మండల ఇన్‌ఛార్జీలుగా యద్దనపూడి రమణయ్య మాదిగ, కోఇన్‌ఛార్జీ బర్రె అర్జున్ మాదిగ సీతామపురం మండల ఇన్‌ఛార్జీలుగా బెజవాడ బాల గురవయ్య మాదిగ, కో ఇన్‌ఛార్జీ కొడవటి కిరణ్ మాదిగ, గొల్లపల్లి రమేష్ మాదిగ, ఉన్నె మద్దల గురవయ్య మాదిగ ఉదయగిరి మండల ఇన్‌ఛార్జీలుగా గొల్లపల్లి మోహన్ మాదిగ, కోఇన్‌ఛార్జీ గొల్లపల్లి వెంకటేష్ మాదిగ, కే.అశోక్ కుమార్, వరికుంటపాడు మండల ఇన్‌ఛార్జీలుగా గంగపట్ల సింహాద్రి మాదిగ, కోఇన్‌ఛార్జీలు బక్కా శ్రీను, తాతపూడి మోసేలను ఇన్‌ఛార్జీలుగా నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాతపూడి డేవిడ్ మాదిగ, గున్న బాబు మాదిగ, సీహెచ్ బొజ్జయ్య మాదిగ, వడ్లపల్లి తిరుపతి మాదిగలను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఆర్పీ ధరలకు మద్యం విక్రయించకపోతే కఠిన చర్యలు

## - ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జివి ప్రసాద్ రెడ్డి

**ముత్తుకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఎంఆర్పీ ధరలకే మద్యం విక్రయించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జివి ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ కమీషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నెల్లూరు వారి ఆదేశాల మేరకు ఇందుకూరుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారన్నారు. దుకాణాల్లో మద్యం ఎంఆర్పీ ధరలకే అమ్మకాలు జరపాలని అటు జరపని యెడల చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఇందుకూరుపేట, టిపి గూడూరు, ముత్తుకూరు మండలంలోని గ్రామాలలో అక్రమ మద్యం సీసాలు అమ్మినచో, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలకు గురౌతారన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇందుకూరుపేట నుంచి ఇప్పటి వరకు 20 కేసులలో 261 మద్యం సీసాలను సీజ్ చేయడం జరిగిందని 20 ముద్దాయిలను అరెస్టు చేసి కేసులు నమోదు చేసారు. అలాగే తాటి కళ్ళు 15 సాంపిల్స్ తీయడం జరిగిందన్నారు. కేసులలో ఉన్నటువంటి 28 ముద్దాయిలను తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసామన్నారు. ఎవరైనా అక్రమ మద్యంపై సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

## మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

## - ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి



ఇందుకూరుపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇందుకూరుపేట మండలం ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి సీఐ జీవీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ కమీషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నెల్లూరు వారి ఆదేశాల మేరకు ఇందుకూరుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో 18 మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారని, దుకాణాల్లో మద్యం ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలని చెప్పారు. అట్లు జరపని యెడల చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రతి మద్యం షాపు వద్ద ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలని, అన్ని ధరలో పట్టిక అమర్చాలన్నారు. మా స్టేషన్ పరిధిలోని మూడు మండలాలు ఉన్నాయని ఇందుకూరుపేట, టీవీ గూడూరు, ముత్తుకూరు కలవన్నారు. ఈ మండలాల్లోని గ్రామాల్లో అక్రమ మద్యం సీసాలు అమ్మినచో కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 20 కేసులలో 261 మద్యం సీసాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. 20 ముద్దాయిలను అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే తాటికల్లు 15 శాంపిల్స్ తీయడం జరిగిందన్నారు. కేసులలో ఉన్నటువంటి 28 ముద్దాయిలను ఇందుకూరుపేట, టీవీ గూడూరు, ముత్తుకూరు తహశీల్దార్ వారి వద్దకు బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

## దడ పుట్టిస్తున్న తుఫాన్ హెచ్చరికలు



కలిగిరి, డిసెంబర్17, ప్రభాతవార్త; గతంలో వానలు పడక అతివృష్టి సంభవిస్తేం ఇప్పుడు తుఫాన్లమీద తుపాన్లతో రైతుల గుండ్చె ధడపుట్టిస్తున్నాయి. వానలు లేక ఇబ్బందులు పడే రైతు లు ఇప్పుడు ఈ వానలు ఎప్పుడు ఆగుతాయా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పుడిప్పుడే పొలాల మీద పైర్లు ఎక్కించుకోనిపెట్టుబడులు పెట్టుకొనే సమయంలో వరస తుఫాన్లు రైతుకంట నిద్రలే కుండా చేస్తున్నారు. వారానికి ఒక అల్పపీడనం వారమంతో ముసారు. ఇలా రైతులనుఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మెట్టప్రాంతమైన ఈ ప్రాంతం లో రైతులు అధికంగా మినుము పంట వేశారు. ప్రస్తుతం ఈపంట కాయ, పిందె దశలో ఉంది. ఇప్పుడుగనక వానలు పడితే కాయలోకి నీరుచేరుతుంది. గింజ నాణ్యత తగ్గుతుంది. పంట పండినా గింజలో నాణ్యత తగ్గి దరతక్కువ పలుకుతుంది. దీనితో రైతుకు పెట్టిన పెట్టుబడికూడా రాక అప్పులు పాలుకాక తప్పదు. మండలంలోని రైతులు వందలాది ఎకరాల్లో మినుముపంట వేసి ఎదురు చూస్తున్నారు. ఒక్కనెలరోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో ఇలా తుఫాన్‌రూపంతో రైతు ఇబ్బంది పడుతున్నాడు. ఇక మిరప, పొగాకు లాంటివాణిజ్య పంటలు వేసిన రైతులువేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టి వానలువల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి పెట్టిన రైతులకు మబ్బులు అధికంగా లేచి వానుల, మంచుకురవడంతోపైరు ఏపుగా పెరగకపోగా రకరకాల జబ్బులు పైర్లను వెంటాడుతున్నాయి. ఇక పచ్చిశనగ విత్తనం వేసే సీజన్ రావడంతో చాలామంది రైతులు ఇప్పటికే భూమిలో శనగ విత్తడం జరిగింది. ఈతుఫాన్ వల్ల వానలు పడినట్లైతే విత్తనాలు భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇలా తుపాన్లమీద తుఫాన్లు వచ్చి ప్రజలతోపాటు మెట్టరైతును గుల్లచేస్తున్నాయి.

## నాలుగు మోడల్ స్మార్ట్ స్కూల్స్ త్వరలో

**- విద్యకు ప్రాధాన్యతనిస్తున్న చంద్రబాబు**

**- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మోడల్ పాఠశాలలు**



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలో కార్పొరేటర్ పాఠశాలలకు ధీటుగా.. నా లుగు మోడల్ స్మార్ట్ స్కూల్స్‌ను త్వరలో ప్రారంభి స్తామని.. అందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని రాష్ట్ర మంత్రి పొం గూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలలను ఆయన జాయింట్ కలెక్టర్ కార్తీక్, కమీషనర్ సూర్యతేజలతో కలిసి పరిశీలించారు. మార్చి 31లోపల వీఆర్‌ఉన్నత పాఠశాలను పున: ప్రారంభించి అన్ని తరగతులు ప్రారంభిస్తామ ని నారాయణ తెలిపారు. అనంతరం మంత్రినారాయణ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా విస్మరించిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌లు విద్యకుపెద్దపీట వేస్తార న్నారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నలంద ఈటెక్నో పాఠశాలలో ఫుడ్‌ఫెస్టా



**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త :** కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని నలంద ఈటెక్నో పాఠశాలలో మంగళవారం ఫుడ్‌ఫెస్టా - 2024ను ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మకు వందనం నిర్వహించి విద్యార్థులు వారి మాతృమూ ర్తులకు పాదాలుకడిగి నమస్కారం చేసుకు న్నారు. అనంతరం విద్యార్థుల మాతృమూ ర్తులు తయారుచేసుకుని తెచ్చిన రుచికరమైన ఆహారపదార్థాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్ర ామంలో న్యాయనిర్ణేతగా డాక్టర్ శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు మారాం చేసినా జంక్‌ఫుడ్స్‌ను అలవాటు చేయవద్దని తెలిపారు. జంక్‌ఫుడ్స్ వలన కలిగే నష్టాలను ఆయన వివరించారు. అనంతరం విజేతలైనవారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల ఛైర్మన్ యండి మజహార్, డైరక్టర్లు వశీం, ఫహీమ్, ప్రిన్సిపాల్ ఫరీదాబేగం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి మాతృమూర్తులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**చేజర్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త :** విద్యార్థు లందరు పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పోక్సో చట్టం అమలు తీరుపై మంగళవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతు విద్యార్థినులు గుడ్ మరియు బ్యాట్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుతోపాటు అన్ని విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులుకి తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఇలాంటి సంఘటనలు పట్ల పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ తిరుమలరావు, హైమావతమ్మ ,ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌరుగుంటలో రెవిన్యూ సదస్సు



**దగదర్తి, డిసెంబర్17 ప్రభాతవార్త :** దగదర్తి మండ లప్రాంతమైన కౌరుగుంట గ్రామంలో మంగళవారం రెవిన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తహ శీల్దారు పి.కృష్ణ, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఏ.శివకుమార్, మండల సర్వేయర్ యన్.కె.రబియ, వీఆర్ఓ పాల్గొన్నారు. సదస్సులో రైతులవద్దనుంచి అర్జీలు స్వీకరించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సదస్సులో టిడిపి నాయకులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఈస్ట్రన్ చానల్ అధ్యక్షులు బత్తల హరికృష్ణాను సన్మానించిన నేతలు



**బుచ్చి డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ఈస్ట్రన్ చానల్ అధ్యక్షులుగా ఎన్నికైన టిడిపి నాయ కులు బత్తల హరికృష్ణాను టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. రేబాల నాయకులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, ఎంపిపి మన్నె పల్లి శ్రీనివాసులు, టెంకాయ సుధాకర్ పలు వురు నాయకులు ఆయన్ని సన్మానిం చారు. ఈ సందర్భంగా హరికృష్ణా మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆశీస్సులతో ఈస్ట్రన్ చానల్ డిస్టిబ్యూటర్ కమీటి ఛైర్మన్‌గా ఎన్నిక కావడం జరిగిందని అందుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రైతులందరికి అనుకూలంగా వ్యవహరిస్తు కాలువల అబివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## బకాయిలో చెల్లించమంటు జాయింట్ కలెక్టర్‌ని కలిసిన చెఱకు రైతులు




**సంగం డిసెంబర్ 17 ప్రభాతవార్త :** సూదల గుంట ప్యాక్టరీ యూనిట్-2 చక్కెర కర్మాగారానికి చెఱకు సరఫరా చేసిన రైతులుచెఱకు కటింగ్ చేసి న కూలీలు చెఱకు ట్రాన్స్‌పోర్టు చేసిన వారికి కర్మాగారం పది కోట్లు బకాయిలు ఉన్నారని అవి చెల్లించక పోగా సరైన సమాధానం చెప్పడం లేద ని చెఱకు రైతులు జిల్లా జాయింట్‌కి కలెక్టర్‌ని వినివించుకున్నట్లు చెఱకు రైతులు తెలిపారు. ఎసిసి యాజ మాన్యంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని రైతులను ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఫిర్యా దులో పేర్కున్నారు.2018-2019 క్రషింగ్ సీజనల్ బకాయిలు అని రైతులు తెలిపారు. 2020 నుండి ఎన్ని సార్లు ఈవిషయాన్ని వారి దృష్టికి తీసుకొని వెళ్ళినా వారు సమాధానం చెప్పడం లేదని రైతులు వాపో యారు. మీరు ఈ విషయం పట్ల స్పందించి రైతులకు రావలసిన బకాయిలు ఇప్పించాలని వారు జిల్లా జా యింట్ కలెక్టర్‌కి విన్నవించారు. ఈకార్యక్రమంలో లేబూరు పరమేశ్వరరెడ్డి, మురళీ, ఆనం ప్రసాద్‌రెడ్డి, సంగం మండలం,బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు రైతులు,కోడూరు పాడు రైతులు, పాల్గొన్నారు.

## పెన్షనర్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి కావలి డీఎస్పీ పి.శ్రీధర్




**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త :** పెన్షనర్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఒత్తిడికి గురికావద్దని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లసంఘం ఆధ్వర్యంలో మంగళ వారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆల్ ఇండ యా పెన్షనర్స్‌డేను పురస్కరించుకుని ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కావలి డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లు ప్రశాంత వాతావరణంలో పయనిస్తూ ఆరోగ్యపరంగా హాయిగా జీవించాలన్నారు. పెన్షనర్లకు ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు డీఎస్పీ చేతులమీదుగా బహుమతులు అందచేశారు. 75 సంవత్సరాలు నిండిన 20మంది పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల రమణయ్యతోపాటు ఉపాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి ఆదిశేషులు, ట్రెజరర్ వెంకయ్య, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## దాడిచేసినవారిపై చర్యలు చేపట్టాలి బాధితుడు ఖాజారహంతుల్లా




**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త :** జలదంకి గ్రామంలో రాత్రి 8గంటల సమయంలో మా అమ్మ, నాన్న సయ్యద్ రసూల్‌సాహెబ్, బీబీజాన్‌లపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేసిన మంచాల ప్రసాద్, ఆయన అనుచరులపై పోలీసులు చర్యలు చేపట్టాలని బాధితుడు ఖాజారహంతుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం కావలి పట్టణం రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కావలి పట్టణానికి చెందిన మంచాల ప్రసాద్ దగ్గర కొంత డబ్బులు వడ్డీకి తీసుకున్నామని తెలిపారు. ఈ డబ్బుల విషయంలో కొంత వివాదం నెలకొనడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని తెలిపారు. అయితే, మంచాల ప్రసాద్ రాత్రి కొంతమంది కిరాయి మనుషులతో జలదంకి గ్రామంలో తమ ఇంటికి వచ్చి వృద్ధ దంపతులైన అమ్మా, నాన్నలపై దాడిచేసి గోడపై ఉన్న ఫ్లెక్సీలు విరగ్గొట్టి ఇంటికి తాళంవేసి వెళ్లారని తెలిపారు. ఈ విషయంపై జలదంకి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశామని, పోలీసులు విచారించి న్యాయంచేయాలని కోరడం జరిగిందన్నారు. తమకు ప్రాణహాని ఉందని నా కుటుంబసభ్యులకు ఏమిజరిగినా ఆయనే కారణమని ఖాజారహంతుల్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఆయన తల్లిదండ్రులు సయ్యద్ రసూల్‌సాహెబ్, బీబీజాన్‌లు పాల్గొన్నారు.

## రెండు రోజుల వర్షాలు నాటు వేయరాదు



**విడవలూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండలం సొకచర్ల దండిగుంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ రెండు రోజులు వర్షాలు ఉన్నాయి హెచ్చరిక జారీ చేయడంప్రతి రైతు వర్షం చూసుకొని వరి నాటు వేయాలని అవగా హన కల్పించారు.రైతులు ఎరువులు వాడడం వాతావరణం బట్టి ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెంచులక్ష్మి, పూజిత, విఏఏ లు, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** సైదాపురం మండలంలో ఒకటి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఎంఈఓ దయాకరరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు సంబంధించి ఆధార్ కార్డులో ఉన్న మార్పులు, చేర్పులు వంటివి నమోదు చేయడం జరుగుతుందని ఎంఈఓ దయాకరరావు తెలిపారు. ఈ క్యాంపు నెలాఖరు వరకు ఉంటుందని, విద్యార్థులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## ఎరువుల వాడకంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి



**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త :** ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటించి ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి. సత్యవాణి తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వాడడం వలన పాస్పేట్ నిల్వలు ఎక్కువై పొలాలు చౌడుబారుతాయన్నారు. ప్రస్తుతం పాటూరు, ఇనమడుగు లాంటి గ్రామాల్లో రైతులు సాగు చేసిన బీపీటీ 5204 రకంలో జింక్ లోపం బాగా కనిపిస్తుందన్నారు. అయితే రైతులు దానిని అగ్గితెగులుగా భావించి ట్రైసైక్లోజోల్ మందు పిచికారి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రైతులు ఈ పిచికారిని ఆపి జింక్ లోపాన్ని సవరించుకోవాలన్నారు. జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేసుకుని తర్వాత మాత్రమే ఎరువులు వాడుకోవాలన్నారు. లేనిపక్షంలో పైరు.. రైతులు వేసే ఎరువులను తీసుకోలేవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు పొటాష్‌ను లేతదశలోనే ఎకరాకు 15 లేదా 20 కిలోలు వేసుకోవాలన్నారు. దీని వలన పైరులో వ్యాధి నిరోధక శక్తి పెరిగి తెగుళ్ల బారిన పడకుండా ఉంటుందన్నారు. రైతులు జింక్ సల్ఫేట్ , పొటాష్‌ను వాడుకుంటే పైరుకు ఉపయోగపడతాయన్నారు. పురుగుమందులు కూడా తమ ఇష్టానుసారంగా వాడుకోవడం వలన ఖర్చు పెరగడమే కాకుండా మిత్ర పురుగులు కూడా చనిపోతాయన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ మాట్లాడుతూ పొలాల్లో మురుగుడు ఉన్న వారు పొలాల్లో ఉన్న నీటిని అప్పుడప్పుడు మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గంధకం కలిగిన ఎరువులు వాడకూడదన్నారు. దీని వలన మురుగుడు ఎక్కువవుతుందన్నారు. ఉల్లికోడు నివారణకు కారోభఫిరాన్ గుళికలు ఎకరాకు 8 కిలోలు చొప్పున వాడుకోవాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుభాషిణి, కోటీశ్వరి, కృష్ణకుమారి, రైతులు ఉన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో పరీక్షాపత్రాలు భద్రం



**కోవూరు, డిసెంబరు 17ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం జరగవలసిన గణితం సంబంధించిన పేపర్ ముందుగా వాట్సాప్‌లో రావడంతో ప్రభుత్వం ఆ పరీక్షను పూర్తిగా రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎంఈవో కార్యాలయంలో ఉన్న ప్రశ్న పత్రాలను పోలీస్‌స్టేషన్ పెట్టెలో ఉంచి భద్ర పరిచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షకు సంబంధించి పేపర్‌ను పరీక్షకు అరగంట ముందే సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందించేలా ఎంఈవో-2 చెంచులక్ష్మమ్మ తగు చర్యలు చేపట్టారు.

## రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపుకు వీఎస్‌యు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎంపిక..



**వెంకటాచలం,డిసెంబర్ 17,ప్రభాతవార్త:** 2025 జనవరి 26న ఢిల్లీలో జరుగు రిపబ్లిక్ డే పెరెడ్ క్యాంపుకు విక్రమ సింహపురి విద్యాలయ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ యల్.తేజస్వి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య విజయ భాస్కర రావు గారు ఫుడ్ టెక్నాలజీ విభాగంలో ఎంఎస్సీ చదువుతున్న ఎల్ తేజస్వినను అభినందించారు. ఉపకులపతి మాట్లాడుతూ నవంబర్ 12 నుంచి 26 వరకుమహారాష్ట్రలోని జలగాం లో జరిగిన పదిరోజుల ప్రీ రిపబ్లిక్ పెరేడ్ క్యాంపులో యూనివర్సిటీ నుంచి ముగ్గురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొంటే వారిలో ఒకరు ఎంపిక అవ్వటం ఎంతో సంతోషకరమైన విషయం అని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి పదిమంది వాలంటీర్లు ఎంపిక అయితే వారిలో ఒకరు విశ్వవిద్యాలయం నుంచి ఎంపిక అవడంఎంతో గొప్ప విషయం అన్నారు. గడిచిన రెండేళ్లలో విశ్వవిద్యాలయం నుంచి ముగ్గురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రిపబ్లిక్ డే పెరెడ్ క్యాంపు లో పాల్గొనటం విద్యాలయ ఎన్ఎస్ ఎస్ విభాగం చేస్తున్న కృషికి తార్కానం అన్నారు. అందుకు ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఆర్ మధుమతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ బి సాయినాథ్ ఎంపికయ్యిన తేజస్వికి అభినందనలు తెలియజేశారు. రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపు కు ఎంపిక అవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే తనకు ప్రోత్సాహం అందించి, అభినందనలు తెలియజేసినందుకు ఉపకులపతి కి ధన్యవాదములు తెలిపారు.

## గురుకులాలు, పాంపాడ్లను పరిశీలించిన సెంట్రల్‌టీం



**కలిగిరి, డిసెంబర్17, ప్రభాతవార్త;**కలిగిరి మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీ య ఉపాది హామీ పథకంద్వారా జరుగుతున్న పనులను మంగళవారం సెంట్రల్ టీం పరిశీ లిం చింది. కలిగిరి మండలంలో పర్యటించిన సెంట్ర ల్ టీం మండలంలోని వెలగపాడులో జరుగు తున్న గోకులాలు, పాంపాండ్లను పరిశీలించారు. అనంతరం కలిగిరి, నాగసముద్రం పంచాయితీలలో జరుగుతున్న పనులను ఫైబర్ చెక్‌డ్యాం వనరులను పరిశీలించారు.ఈసందర్భంగా నాగసముద్రంలో సాగు చేయబడు తున్న డ్రాగన్ ఫ్రూట్స్, గోకులాలను ,రూఫ్‌వాటర్ పనులను చూసి సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరంవారు మాట్లాడుతూ కలిగిరి మండలంలో జాతీయ ఉపాది హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులు ఆశా జనికంగా ఉన్నాయన్నారు. ఈ పనులను ఇలాగే నిర్వరామంగా కొనసాగించి మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. సెంట్రల్‌నుండి వచ్చినవారిలో సచింద్రకుమార్‌పట్నాయక్,(ఐఆర్ యస్‌యస్‌ఎగ్జక్యూటివ్ డైరక్టర్‌జాయింట్ సెక్రటరీలెవల్ ,ఎఫ్‌సిఐ)లోకేష్, డి. లక్ష్మీన్నారాయణ(సీనియర్ సైంటిస్ట్ గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్)జిల్లాడ్వామా పిడిగంగాభవాని,ఎపిడి శంకర నారాయణ,గాయిత్రీ దేవి,మండల ఎపిఓ శ్రీనివాసులు పీల్డ్‌శిబ్బంది పాల్గొన్నారు.

## దక్షణ కాలువ చైర్మన్‌గా వేలూరు కేశవ చౌదరి



**చేజర్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త :** రెండు రోజుల క్రితం జరిగిన సాగునీటి సంఘం 4 ఎల్ నుండి 9 ఎల్‌కి అద్యక్షులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు వేలూరు కేశవ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన చేజర్ల సంఘ మిత్ర కార్యాలయంలో నిర్వహించి కమీటి ప్రెసిడెంట్ మరియు వైస్ ప్రెసిడెంట్ నియామక కార్యక్రమంలో వేలూరు కేశవ చౌదరిని కమిటి ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ సినీయర్ నాయకులు తాళ్లూరు గిరినాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రావి ప్రసాద్‌రెడ్డి, ఉడతా హజరత్తయ్య, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## నూతన సాగునీటి సంఘాలతో సమావేశం నేడే

**ఆత్మకూరు,డిసెంబర్17,ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గపరిధిలోని నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో బుధవారం ఉదయం 10-30గంటగలకు నెల్లూరులోని ఆనం వివేక సమావేశ మందిరంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. కావున ఈసమావేశానికి ఇరిగేషన్ , సోమశిల ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు, నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాల బాధ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

## చాగణం గ్రామంలో రెవెన్యూ సదస్సు



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చాగణం గ్రామంలో అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అనురాధ, చాగణం గ్రామ సాగునీటి సంఘం అధ్యక్షుడు కందాటి దయాకర్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ కందాటి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు బద్వేలు జనార్ధన్‌రెడ్డి, కొండపల్లి కర్రి శ్రీను, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మార్గశిర మంగళవారం పర్వదినం సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో నాగ వల్లి పత్రాలతో ప్రత్యేక పూజలను అభిషేక కార్య క్రమాలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్రస్వామి, భక్తులు ఉన్నారు.

## రెవిన్యూ సదస్సు రైతుల కోసం - ఆర్డీవో వంశీ కృష్ణ



**విడవలూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండలం గండవరం, గొట్లపాలెం జరిగిన రెవిన్యూ గ్రామ సభ కార్యక్రమం గ్రామ సచివాలయంలో కావలి ఆర్డీవో వంశీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సదస్సు గ్రామసభలో రైతులు తెలిపిన అభ్యంతరాలను, తప్పిదాలను, వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి రైతులకు శాశ్వత పరిష్కారం చేయడం జరుగుతుంది. రైతులు ఎవరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం రైతుల వద్ద అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ ఐ సునీల్, తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ రాజకుమారి, వీరోఓ లు షఫీ, ఏడుకొండలు, జగదీశ్ , రేవతి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీల అభివృద్ధికి దోహద పడండి



**చేజర్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ప్రజా ప్రతినిధులతో అధికారులు భాగస్వామ్యమై సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయితీల అభివృద్ధికి దోహదపడాలని ఏపిఎస్ఐఆర్డిపి ఆర్ రాష్ట్ర పరిశీలకులు ఏ.రమేష్ సూచించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయలలిత ఆద్వర్య ంలో ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ప్రజాప్రతినిధులకు సచివాలయం సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపిఎస్ఐ ఆర్డిపిఆర్ రాష్ట్ర పరిశీలకులు ఏ రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల యొక్క జీవన ప్రమాణాలతో పాటు వారి యొక్క ఆర్థిక పరిస్థితిపై అధికారులు పూర్తి అవగాహనతో కలిగి ఉండాలని తెలిపారు.ప్రజాప్రతినిధులు,అధికారులు గ్రామాల్లో ప్రజలతో భాగస్వామ్యంతో పనిచేసి గ్రామ పంచాయితీల అభివృద్ధికి దోహదపడాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు డిఎల్‌పిఒ డి.నారాయణ, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ఎ.వై.శివ ఇన్చార్జి ఈవో పిఆర్‌డి రామయ్య మండలాధికారులు సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం



**కోవూరు డిసెంబర్ 17 ప్రభాతవార్త :** కోవూరులోని బైపాస్ లోని కళ్యాణ మండ పంలో మంగళవారం ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోవూరు మరియు పడుగుపాడు ప్రాంతం సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతు గత సంవత్సరాలుగా తమ కౌన్సిల్లో సభ్యులుగా ఉంటు 75 సంవత్సరాలు దాటిని సీనియర్ సిటిజన్స్‌కి సన్మానం చేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ సిటిజన్ కౌన్సిల్ నిరంతరం పోరాడుతునే ఉంటుందని అన్నారు. ఇంకా ఈకార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణయ్య,కోశాధికారి ఐ వీరభద్రయ్యలు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అంకమ్మ,మల్లెంకొండస్వామి తిరునాళ్ళ



**మర్రిపాడు, డిసెంబర్17, ప్రభాతవార్త:** మండలంలోని చుంచులూరు గ్రామంలో అంకమ్మ,మల్లెకొండేశ్వర స్వామి వారి తిరునాళ్ళ మంగళవారంతో ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా ఘనంగా పొంగళ్ళను పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ సామూహిక విందుభోజనాలు ఏర్పాటు చేశారు. ఈమహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహజంచారు. ఈకార్యక్రమంలో కోరేపు కుటుంబ సభ్యులు , బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



**కలువాయి డిసెంబర్ 17ప్రభాతవార్త :** పంచాయితీ అభివృద్ధి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించాలని పంచాయితీ విస్తరణ అధి కారి జి.వి రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగ ళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు రెండు రోజులు పాటు జరుగనున్న పంచాయితీల అభివృద్ధి, ప్రణాళి కలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతు పంచాయితీల పరిధిలోని గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు అవసరమైన పనులను అధికారులు ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు సమావేశమై ప్రతిపాదిస్తే ప్రభుత్వం నుండి అనుమతులతో పాటు నిధులు విడుదలైతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం రవికుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పద్మ, రాజేశ్వరమ్మ, పంచాయితీల సర్పంచులు,కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 2030 నాటికి సుస్థిర పాలన అందించాలి




**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** 2030 నాటికి సుస్థిర పాలన ప్రజలకు అందించేలా ప్రణాళికలు రచించినట్లు ఉదయగిరి జడ్పీటీసీ మోడీ రామాంజ నేయులు యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయగిరి శ్రీ శక్తి భవనంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, మండల శాఖ అధికారులకు సచివాలయ సిబ్బందికి మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పలువురు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు అందరి ఉపాధి ఆరోగ్య భద్రత సామాజిక భద్రత ప్రతి ఒక్కరికి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడీ రామాంజనేయులు, ఎంపీడీఓ అప్పాజీ, వెలుగు ఏపీవో షేక్ ఖాజా, రహమతుల్లా, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సోమిరెడ్డిని సత్కరించిన అమరా



**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త** మాజీ మంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కావలి అన్నపూర్ణమార్కెట్ ప్రముఖ వస్త్రవ్యాపారి, బిజెపి నేత, జియస్‌టి సభ్యుడు అమరా వెంకటసుబ్బారావు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. నెల్లూరులో మంగళవారం సోమిరెడ్డిని కలిసి ఆయనను సత్కరించారు. అమరా వెంట కావలి టిడిపి సీనియర్ నేతలు సన్నిబోయిన నారాయణ, జెట్టి శేషారెడ్డి, సన్నిబోయిన కమల్, బిజెపి పట్టణ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డితో కొద్దిసేపు ముచ్చటించారు.

## జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

### కోటంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కావలి ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అభివృద్ధిలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కీలకపాత్ర పోషించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నుడా కార్యాలయంలోజరిగిన కోటంరెడ్డి ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యేదగుమాటి పాల్గొని ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు.

## మంత్రి ఆనంను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త** దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి అమరావతినుంచి నెల్లూరుకు వెళుతూ మార్గమధ్యంలోని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నివాసానికి వచ్చారు. మంత్రి ఆనంకు స్వాగతంపలికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పూలబొకే అందచేశారు. కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి ఆనం దృష్టికి ఎమ్మెల్యే దగుమాటి తీసుకువెళ్లారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన మంత్రిని కోరారు. మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే దగుమాటి నివాసంలో ఇద్దరూ చాలాసేపు ముచ్చటించుకున్నారు.

## అజీజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన సాబీర్ ఖాన్



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా షేక్ అబ్దుల్ అజీజ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విజయవాడలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలోని షేక్ అబ్దుల్ అజీజ్ ఛాంబర్‌లో తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్ అబ్దుల్ అజీజ్‌కి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీమేధా విద్యార్థిని




**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కావలి శ్రీమేధా జూనియర్ కళాశాల విద్యార్థిని ఆవుల ముకేశ్వరి ఎంపికైంది. మంగళవారం కళాశాలలో కరస్పాండెంట్ పి.జానకిరాం, ప్రిన్సిపాల్ యన్.లోకేష్, పిడి జిడి.మణి, డైరక్టర్స్, అధ్యాపక బృందం ఈ విద్యార్థినిని అభినందించారు. 15వ తేదీ కావలి మినీస్టేడి యంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా కబడ్డీ అసోసియే షన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు ముకేశ్వరి ఎంపికైంది.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** నగరంలో ఉన్న టౌన్ హాల్లో నెల్లూరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ, ఆరోగ్య విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 17 జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమాన్ని గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేఈసీ విద్యా సాగర్, జిల్లా అధ్యక్షులు ఏ.హరిబాబు , జిల్లా జనరల్ సెక్రటరీ కల్పం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు వృద్ధాప్య దశలో ప్రశాంతంగా బతకడానికి అందిస్తున్న పెన్షన్ వచ్చేందుకు కారకులైన డాక్టర్ ధరమ్ స్వరూప్ నకరాకి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.చంద్రచూడే, జస్టిస్ డీఏ దేశామ్‌లను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు అని, పెన్షన్ తగ్గించే రద్దు చేసే అధికారం ఏప్రభుత్వానికి లేదని, పెన్షనరును సమాజంలో గౌరవంగా జీవించేటట్లు చూడడం ప్రభుత్వ విధి అని రాష్ట్ర, జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేఈసీ విద్యాసాగర్, జిల్లా జనరల్ సెక్రటరీ కల్పం శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందించిన రిటైర్డ్ కాబడిన డాక్టర్లు అధికారులు ఉద్యోగులు సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం విశ్రాంత డాక్టర్లు అధికారులు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ సలహాదారులు డాక్టర్ ఎస్‌డీ మున్వర్ సుల్తానా, వి.శేషగిరిరావు, కోశాధికారి నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణయ్య, ఏపీ హంస గౌరవ అధ్యక్షురాలు ఆర్.ఇందిరా, గౌరవ సలహాదారు పరిమళ, లక్ష్మీ నారాయణ, బ్లడ్ డోనర్ బి.రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పంటలను బీమా చేసుకోండి

**వలేటివారిపాలెం డిశంబరు 17, ప్రభాతవార్త** మండలంలోని వలేటివారిపాలెం, శింగమనేనిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్ కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొనివ్యవసాయ సాగులో రైతులుకు పలు సలహా లు సూచనలు చేశారు. రబీలో రైతులంతా తమ పంటలకు భీమా చేయించు కోవాలని సూచించారు. ఇందుకు స్థానిక వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాల న్నారు. పొలాల్లోని పంటనలు పరిశీలించారు.అపరాలు నూనెగింజలసాగు చేసుకోవడం మంచిదన్నారు.ఈ కార్యక్రమంలోసిబ్బంది ప్రభు రైతులు రామానాయుడు వెంకేశ్వర్లు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌జెండర్స్‌కు మాదక ద్రవ్యాలు పై అవగాహన సదస్సు




**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** అడ్వాన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కౌన్సిలింగ్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, అమరావతి చాప్టర్ కలసి 100 మంది ట్రాన్స్జెండర్‌కి మాదక ద్రవ్యాలు, మద్యం నుండి బయటపడుటకు కొన్ని సూత్రాలను ఏపిసిహెచ్ఆర్ డైరెక్టర్ డా. ఎం. టైటస్ నిర్మల్ కుమార్ చెప్పారు. యువత డ్రగ్స్‌కి, త్రాగుడుకు బానిస కాకుండా చదువుల మీద శ్రద్ధ చూపించి మంచి భవిష్యత్తు నిర్మించు కోవాలని చెప్పారు. కన్యాకుమారి, కౌన్సిలర్ క్యాన్సర్ వ్యాధిని గురించినివారణ పద్ధతులను చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సార్డ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రూత్ బినోమి ఆధ్వర్యంలో జరిపించారు. క్రిస్మస్ సందర్భంగా 100 మంది ట్రాన్స్‌జెండర్స్‌కి చీరలు బహుకరించారు. అనంతరం అన్నదానం చేశారు.

## అల్లూరు గ్రామ దేవతలైన ముగ్గురు అమ్మల ఉత్సవ మొదటి చాటింపు



**అల్లూరు డిసెంబర్ 17 ప్రభాతవార్త:** అల్లూరు గ్రామ దేవతలైన శ్రీ గంగమ్మ,శ్రీ కలుగోళమ్మ, శ్రీ పోలేరమ్మ ఉత్సవ మొదటి చాటింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు ముందుగా గ్రామ దేవత అయిన శ్రీ పోలేరమ్మకు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మరియు అల్లూరు ఊరు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గ్రామ పెద్ద కాపు పెద్ద గొల్ల పెద్ద మాదిగ సమక్షంలో మొదటి చాటింపు నిర్వహించారు సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ మంగళవారం శ్రీ గంగమ్మ,శ్రీ కలుగోళమ్మ,శ్రీ పోలేరమ్మ ముగ్గురు అమ్మల గ్రామోత్సవాన్ని అల్లూరు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు సహకారంతో ఆచార సాంప్రదాయాలను పాటిస్తూ ఘనంగా నిర్వహించేందుకు మొదటి చాటింపు నిర్వహించాము అని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లూరు ఊరు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు,దేవస్థానం ఈవో చిట్టిబాబు పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు పట్టుకున్న పోలీసులు



**బుచ్చి డిసెంబర్ 17ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో చికెన్ వ్యర్థాలు రవాణా జోరుగా సాగుతుండగా కాగుల పాడు గ్రామంలో అక్రమంగా చేపల గుంటలకు చికెన్ వ్యర్థాలు వేస్తున్న విషయం తెలుసుకున్న బుచ్చిరెడ్డిపాళెం సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మినిలారీ, మిని వ్యాన్లను సీజ్ చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు గుంటలు పెట్టిన రైతులు చికెన్ వ్యర్థాలు గుంటలో వేస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చికెన్ వేస్టు విషయంలో హెచ్చరిస్తున్నా రైతులు మాత్రం గుంటలలో చికెన్ వేస్తున్నారని తెలిపారు. చికెన్ వ్యర్ధాల రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

## సాగునీటి కాలువలకు మాహర్దశ



**కోవూరు, డిసెంబరు 17, ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంకు సంబంధించి సాగునీటి కాలువలకు రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్వ వైభవం రానుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ ఎన్నికల అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాలువలకు సంబంధించి పట్టించుకోకపోవడంతో రైతులు పూర్తిస్థాయిలో ఇబ్బందులకు గురయ్యారు. ఆ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం సాగునీటి సంఘాలకు సదరన్ చానెల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు రైతుల సంక్షేమే ధ్యేయంగా పనిచేసే నాయకులే ఎన్నికయ్యారని, వారి ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో సాగునీటి కాలువలకు తప్పనిసరిగా మహర్దశ వస్తుందన్నారు. ప్రస్తుతం ఈ సాగునీటి సంఘాలకు ఎన్నికైన వారిపై గురుతర బాధ్యత ఉందని, దానిని వారు పూర్తిగా అవగాహన చేసుకుని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని సాగునీటి సంఘాలు పూర్తిస్థాయిలో ఏకగ్రీవం అయ్యేందుకు ప్రోత్సహించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన రైతులకు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆదాల శివారెడ్డి,నేతలు జెట్టి మదన్‌రెడ్డి అశోక్‌రెడ్డి, జి. అశోక్‌కుమార్, బాల రవి, ఆత్మ మాజీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దాసరి మురళి, కరేటి శ్రీనివాసులు, మస్తాన్, నాగరాజు, , తదితరులు ఉన్నారు.

## హోటల్ యజమానులకు ఫుడ్ సేఫ్ట్ అధికారుల అవగాహన




**బుచ్చి డిసెంబర్ 17 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అధి.కారులు హోటల్ యజమానులకు అవగాహన సదస్సు జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిఫల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్ర జా మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హోటల్‌కి వచ్చే కస్టమర్లకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు.కుళ్ళిపోయిన ఆహారాన్ని సరఫరా చేస్తే హోటల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అంతేకాకుండా కల్తీ ఆహారం పెడితే ఎటువంటి చర్యలు తీసుకోవల్సి వస్తుందో వాటిపైన కూడా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ కమీ షనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నీరజ, ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, హోటల్ యజమానులు పాల్గొన్నారు.

## సదరన్ చానల్ డిస్టిబ్యూటర్ కమీటి ఉపాధ్యాక్షులుగా నెల్లూరు రమణారెడ్డి



**బుచ్చి డిసెంబర్ 17 ప్రభాతవార్త** సదరన్ చానల్ డిస్టిబ్యూటర్ కమీటి ఉపాధ్యాక్షులుగా రేబాల నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు రమణారెడ్డి ఎన్నిక అయ్యారు.ఈ సందర్భంగా నాయకులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, టిడిపినాయకులు లఘంతోటి మస్తానయ్య, బిజెపినాయకులు ఆకుల వెంకటస్వామి బుచ్చిరెడ్డిపాళెంలో పలు సాగునీటి సంఘాల అధ్యక్షులు రమణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మా టాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆశీస్సులతో సదరన్ చానల్ డిస్టిబ్యూటర్ కమీటి ఉపాధ్యాక్షులుగా ఎన్నిక కావడం జరిగిందని ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.అలాగే నాయకులకు,నీటి సంఘం అధ్యక్షులకు కూడా ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు.

## కార్యకర్తలకు పిలుపునిచ్చిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని 4,5వ డివిజన్ పరిధిలోని మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ రివిట్మెంట్ వాల్ మైపాడు రోడ్డు మధ్యగల స్థలములో గత మన వైసిపి హయాంలో కెనాల్ రివిట్మెంట్ పనులను కోట్ల రూపాయలతో చేపట్టి ఆ ప్రాంతంలో 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు, లైటింగ్ సిస్టం, పనులు పూర్తి చేయడం జరిగింది. కెనాల్ పక్కన వాకింగ్ ట్రాక్, బ్యూటిఫికేషన్ అభివృద్ధి చేయడం కోసం పనులు చేపట్టడం జరిగింది. ఇటీవల వచ్చిన కూటమి ప్రభుత్వంలో మంత్రి నారాయణ ఆ ప్రాంతంలో షాపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకువచ్చారు. అందులో వారి తాలుకు మనుషులకు ఇప్పించుటకు వారు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఈ విషయములో మన పార్టీ తరుపున అభ్యంతరం వ్యక్తం చేయడం జరిగినది. తద్వారా వారు ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి అందరు దరఖాస్తు చేసుకోమని చెప్పారు. ఇందులో 18వ తేది బుధవారం సాయంత్రంతో దరఖాస్తు స్వీకరణ సమయము ముగుస్తుంది. షాపులను లాటరీ పద్ధతిలో కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఇదంతా మన గవర్నమెంట్ లో జరిగిన అభివృద్ధి. ఇందులో మనకు అందుబాటులో అర్హుల చేత అప్లై చేయిద్దాము. డ్రా తీసేటప్పుడు పారదర్శకంగా చేయమని తరువాత వత్తిడి తెద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ఫారం ను ఈ క్రింద పిడిఎఫ్ ఫార్మట్ లో జతపరచడం జరిగినది. ఆసక్తిగలవారు వారు దరఖాస్తులు డౌన్ లోడ్ చేసుకొని అప్లైడ్ చేయించ గలరు. ఇందులో దరఖాస్తు ఫారంతో పాటు జత చేయవలసినవి. రైస్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్ట్ ఫోటోలు 3, బ్యాంకు ఖాతా పుస్తకము మొదటి పేజి జెరాక్స్ కావున మీ పరిధిలోని ఆసక్తి అర్హత కలిగిన వారిచేత షాపుల కేటాయింపు కొరకు దరఖాస్తు చేయించవలసిందిగా కోరుతున్నాను. ఈ షాపులకు దరఖాస్తు చేసుకున్న వారికి అవసరమైన వెండర్ లైసెన్స్ పొందుటకు అగు ఫీజును మన కార్యాలయం నుండి చెల్లిస్తామని తెలిపారు.

## గుంతలు పూడ్చిన మున్సిపల్ అధికారులు



**కావలి, డిసెంబర్17 ప్రభాతవార్త** కావలి మున్సిపల్ కమీషనర్ ఆదేశాలమేరకు పట్టణంలోని పలు వార్డుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 3, 5, 6, 8, 9, 27, 28, 39, 40 వార్డుల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. పురపాలకసంఘ పరిధిలో మిగిలిన వార్డుల్లోకూడా త్వరలోనే గుంతలు పూడ్చే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి శిక్షణా కార్యక్రమం



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** మంచి సిమెంట్ రోడ్ల నిర్మాణం రోడ్డు కల్వర్టు రూపకల్పంలో సాఫ్ట్వేర్ల ఉపయోగం పై నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం జిల్లా నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశం మందిరంలో నిర్వహించారు. భారత ప్రభుత్వం గ్రామ అభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి, హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు, వివిధ ప్రాజెక్టు కింద సిమెంట్ రోడ్లు, వివిధ ప్రాజెక్టుల ద్వారా నిర్మాణ రోడ్లు నిర్మాణంలో తీసుకోవాల్సిన నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిర్మాణ శైలి నాణ్యత ప్రమాణాలు పాటించాలి,వివిధ శాఖల ప్రభుత్వ, ఆదేశాలు మార్గదర్శకులు ద్వారా ,మన్నికమైన మంచి సిమెంట్ రోడ్లు ఎలా నిర్మించాలి అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల ప్రాజెక్టు ప్రభాకర్ రెడ్డి ఆర్గనైజర్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. జిల్లాలోని అందరు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ విభాగం సంబంధించిన అధికారులందరూ పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుంది జే సీ కార్తీక్



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ భవన్ నుండి కస్తూర్బ కళాక్షేత్రం వరకు ర్యాలీ చేయడం జరిగింది, ఈ ర్యాలీ ని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ ఐఏఎస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. మానవ జీవితంలో విద్యుత్ నిత్యావసర వస్తువుగా ఉందన్నారు. ఇండ్లలో అనవసరంగా విద్యుత్ ను ఉపయోగించవద్దని, లైట్స్,ఫ్యాన్స్ అవసరం అయినప్పుడే వాడాలని, ఆఫీస్‌లల్లో కూడ ఉద్యోగస్తులు ఆఫీస్ నుండి ఇంటికివెళ్లే టప్పుడు లైట్స్,ఫ్యాన్స్ ఆఫ్ చేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడంతో ప్రకృతి సహజ సిద్ధంగా లభించే బొగ్గు, నీరు ఉత్పత్తి చేయడంతో తరిగిపోతున్నాయన్నారు. అందుకే ఆదా చేసి భావితరాలకు అందించేలా, సోలార్,విండ్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై దృష్టిపెట్టాలన్నారు.ఈ వారోత్సవాలలో విద్యుత్‌పొదుపుపై అధికారులు ,సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన పొదుపు చర్యల ఆవశ్యకతను ప్రతి రోజు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు విద్యుత్ సిబ్బంది కల్పించా రన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపు చర్యలు పాటించడం ద్వారా పరోక్షంగా ఎక్కువ విద్యుత్ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అందు బాటులో ఉండి తద్వారా ఉత్పత్తి పెరిగి రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందు తుంది. ప్రస్తుతం వినియోగదారులు వినియోగిస్తున్న ఉపకరణాల స్థానంలో నాణ్యమైన విద్యుత్ తక్కువగా ఉపయోగించుకునే 5 నక్షత్రం కలిగిన విద్యుత్ ఉపకరణాలు వినియోగించడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది. విద్యుత్ విని యోగంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. విద్యుత్ ను వృథా చేయకుండా పొదు పుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మానవ జీవితంలో విద్యుత్ నిత్యావసర వస్తువుగా ఉంది. సూపరింటెం డింగ్ ఇంజనీర్ వి.విజయన్ ,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్ కు అభినందనలు



**నెల్లూరు క్రైమ్ డిసెంబర్ 17 ప్రభాతవార్త :** పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2004లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచిన ఆడిపూడి చందనను జిల్లా పోలీస్ శాఖతో పాటు ఆమె ఏడవ తరగతి నుండి పదో తరగతి వరకు చదువుకున్న కేఎన్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు కూడా ప్రత్యేకంగా అభినందించారు. హై స్కూల్లో క్రీడల్లో ఓనమాలు దిద్దుకొని కఠోర శ్రమతో నిరంతర సాధనతో 10 వ తరగతికి చేరుకొనే సమయానికి ఎన్నో పతకాలు సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఉన్నత చదువులు పూర్తిచేసుకొని పోలీసు శాఖ లో కొలువు సాధించి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన వార్షిక స్పోర్ట్స్ మీట్లో ఏకంగా ఏడు బంగారు పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి జిల్లా ఎస్పీ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్న చందనను పోలీస్‌శాఖ ఉన్నతాధికారులతో పాటుసిబ్బంది అంతా అభినందించారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న కూటమి

- 250 వేద పండితుల పోస్టుల భర్తీ త్వరలో
- దూపదీప నైవేద్యాలకు రూ.5వేలు
- అర్చకులకు రూ.15వేలు
- వేద విద్యార్థులకు రూ.3వేలు
- దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయం ప్రారంభం



నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రంగనాథస్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయాన్ని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,జడ్పీ ఛైర్మన్ ఆనంఅరుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లా డుతూ గత ప్రభుత్వం ఆలయాలను పూర్తిగా విస్మరించిందని, తమ ప్రభుత్వ హయాంలో ఆగమ శాస్త్రలను గౌరవిస్తూ ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే నెల్లూరు నగరంలో 85 లక్షల రూపాయలతో సహాయ కమీషనర్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే మొదటి అంతస్తు నిర్మాణ పనులను కూడా దేవాదాయ శాఖ నిధులతో పూర్తి చేస్తామని చెప్పారు. రంగనాథస్వామి ఆలయ ఘాట్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేసేందుకు మంత్రి నారాయణ దృష్టి పెట్టినట్లు చెప్పారు. వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కూడా చర్యలు చేపడతామన్నారు. నెల్లూరు నగరంలోని అనేక ప్రముఖ ఆలయాలనుత్వరలో తాను, మంత్రి నారాయణ కలిసి పరిశీలించి ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇటీ వల శృంగేరి పీఠాధిపతి వారు జిల్లాలో పర్యటించి అనేక ఆలయాలను సందర్శించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని మంత్రి చెప్పారు. త్వరలోనే సోమశిల సోమేశ్వరాలయ నిర్మాణ పనులు మొదలు కానున్నట్లు చెప్పారు. నెల్లూరు నగరాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్న మంత్రి, దేవాదాయ శాఖలో అనేక హామీలు నెరవేర్చినట్లు చెప్పారు. ప్రధానంగా గతంలో దూపదీప నైవేద్యాలకు రూ.5వేలు ఇస్తుండగా 5400 ఆలయాల్లో ఒక్కొక్క ఆలయా నికి ప్రస్తుతం రూ.10వేలు ఇస్తున్నామని, అర్చకులకు గతంలో రూ10వేలు వేతనం ఇస్తుండగాత మప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుందని , వేద విద్యార్థులకు రూ.3వేలు సంభావన అందించి వేద విద్యను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. అన్ని ఆలయాలకు త్వరలోనే పాలక మండళ్లను నియమిస్తామని ఇందులో ఒక నాయిబ్రాహ్మణుడు, బ్రాహ్మణులకు స్థానం కల్పించనున్నట్లు చెప్పారు. వేదాలు, ఆగమ శాస్త్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం కంకణబద్ధులై పని చేస్తుందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కావలి, ఉదయగిరి, వెంకటగిరి ఎమ్మెల్యేలు దగ్గుమాటి కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.